


## ఫీల్డ్ అసిస్టెంట్ ఆత్మహత్య ప్రభుత్వ హత్యే

**-డిసిసి అధికార ప్రతినిధి శెట్టి శ్రీకాంతప్ప**

**పాపన్నపేట, ఆగస్టు 8, ప్రభాతవార్తం** గ్రామీణ ఉపాధి హామి ఫీల్డ్ అసిస్టెంట్ దుర్గయ్య ఆత్మహత్య ప్రభుత్వ హత్యే అని డిసిసి అధికార ప్రతినిధి శెట్టి శ్రీకాంతప్ప ఆరోపించారు. సోమవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో శ్రీకాంతప్ప మాట్లాడుతూ టిఆర్ఎస్ ప్రభుత్వం అనాలోచిత నిర్ణయాల మూలంగా ఆత్మహత్యలు చోటు చేసుకుంటున్నాయని మండిపడ్డారు. తొలగించిన ఫీల్డ్ అసిస్టెంట్‌లను తిరిగి విధుల్లోకి తీసుకుంటున్నట్లు ప్రకటించినా నేటి వరకు దాన్ని అమలు చేయకపోవడంతో ఎఫ్ఏల మనోవేదకు గురికావడం సమజమని వాపోయారు. సోమవారం ఆత్మహత్య చేసుకున్న దుర్యయ్యది ప్రభుత్వ హత్య అని ఆందోళన వ్యక్తం చేశారు. ఆత్మహత్య చేసుకున్న ఫీల్డ్ అసిస్టెంట్ దుర్గయ్య కుటుంబానికి 10 లక్షల రూపాయలు అందించడంతో పాటు ఫీల్డ్ అసిస్టెంట్‌లను తిరిగి విధుల్లోకి తీసుకో వాలని డిమాండ్ చేశారు.

## అత్తింటి వేధింపులకు వివాహిత ఆత్మహత్య

**మెదక్ అర్బన్, ఆగస్టు8 ప్రభాతవార్త:** అత్తింటి వేధింపులకు వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన సోమవారం మెదక్ పట్టణంలో నవాబ్‌పేటలో జరిగింది. అయితే అత్తింటి వారు హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నారని మృతురాలి తల్లి ఆరోపిస్తున్నారు. పోలీసులు, కుటుంబీకుల కథనం ప్రకారం మెదక్ పట్టణం నవాబ్‌పేటలో నివాసం ఉంటున్న గుప్త లక్ష్మణ్‌తో కొల్చారం మండలం చిన్నఘనపూర్‌కు చెందిన సంతోష (25)తో నాలుగేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఒక పాప ఉంది. అయితే గత కొంత కాలంగా సంతోషను భర్తతో పాటు అత్త మామ విఠల్, యాదమ్మలు వేధింపులకు గురి చేస్తున్నారు. ఇంట్లో ఉన్న ఫ్యాన్‌కు సంతోష ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. విషయం తెలుసుకున్న తల్లి కమలమ్మతో పాటు బంధువులు ఘటన స్థలానికి చేరుకుని మృతిపై అనుమానం వ్యక్తం చేశారు. భర్త, అత్త మామలు కలిసి హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. దీంతో ఘటనా స్థలానికి చేరుకున్న సీఐ మధు పరిశీలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

## గాంధీ సినిమాను విద్యార్థులు తిలకించేలా ఏర్పాట్లు చేయాలి

**కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ అధికారులకు ఆదేశాలు**

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :** భారత స్వాతంత్ర్య వజ్రోత్స వాల సందర్భంగా విద్యార్థుల కోసం ప్రత్యేకంగా ప్రదర్శించనున్న గాంధీ సినిమాను జిల్లాలోని విద్యార్థులు తిలకించేలా సమన్వయంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ విద్యా, రవాణాశాఖ అధికారులను అదేశించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో విద్యా, రవాణాశాఖ అధికారులతో సమావేశం నిర్వహించి అయన మాట్లాడారు. ఈనెల 9 నుంచి 11 వరకు, 16 నుంచి 21 వరకు జిల్లాలోని సిద్దిపేట, గజ్వేల్, హుస్నాబాద్, చేర్యాల జిల్లా వ్యా ప్తంగా మొత్తం 10 థియేటర్లలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు 6 నుంచి 10 తరగతి చదువుతున్న విద్యార్థుల కోసం గాంధీ చిత్రాన్ని ఉచితంగా ప్రదర్శించడం జరుగుతుందన్నారు. ఇప్పటికే గాంధీ సినిమాను డౌన్‌లోడ్ చేసుకుని సినిమా హాల్‌లను సిద్దంగా ఉంచడం జరిగిందన్నారు. ఈనెల 9 నుంచి 11 వరకు జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ యుపిఎస్, జడ్పీ, గురుకులలు, వివిధ సంక్షేమ హాస్టల్లో 6 నుంచి 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు సినిమా చూపించడం జరుగుతుందన్నారు. విద్యార్థులను సమీప థియేటర్ల వద్దకు తరలించడానికి ఉచిత వాహనాలను ఏర్పాటు చేయాలని కలెక్టర్ అదేశించారు. విద్యార్థులను క్షేమంగా థియేటర్లకు తీసుకెళ్లి అనంతరం క్షేమంగా ఇంటికి చేర్చే బాధ్యత విద్యాశాఖ అధికారులే తీసుకోవాలన్నారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ ముజామిల్‌ఖాన్, విద్యాశాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి, ఎంఈఓలు, హెచ్‌ఎంలు తదితరులు పాల్గొన్నారు.

## గిరిజనులను చిన్నచూపు చూడటం తగదు

**-బీజేపీ జిల్లా అధ్యక్షులు గడ్డం శ్రీనివాస్**




అదనపు కలెక్టర్‌కు మెమోరాండం అందజేస్తున్న బీజేపీ నాయకులు

**మెదక్ అర్బన్, ఆగస్టు8 ప్రభాతవార్త:** రాష్ట్రం ఏర్పడి 8 సంవత్సరాలు అవుతున్నా జనాభా ప్రాతిపదికన ఏర్పాటు చేస్తామని చెప్పిన రిజర్వేషన్ ఇప్పటి వరకు ఏర్పాటు చేయకపోవడం, గిరిజనులపై చిన్నచూపు చూడటం సరైనది కాదని బీజేపీ జిల్లా అధ్యక్షులు గడ్డం శ్రీనివాస్ అన్నారు. సోమవారం ఈ మేరకు కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ ప్రతిమ సింగ్‌కు మెమోరాండం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్టీ మోర్చా అధ్యక్షులు రెడ్యానాయక్, మాజీ జెడ్పీ చైర్మన్ బాలయ్య, జిల్లా ఉపాధ్యక్షులు సత్యనారాయణ, జిల్లా యువ మోర్చా అధ్యక్షులు ఉదయ్ కిరణ్, జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు వీణ, జనార్ధన్, ప్రసాద్ సంగీత తదితరులు పాల్గొన్నారు.

### పోలీస్ స్టేషన్‌లో రక్షా బంధన్

భారతీయ జనతా పార్టీ మహిళా మోర్చా తరపున మెదక్ పట్టణంలోని పోలీస్ స్టేషన్‌లో ఫ్రెండ్లీ పోలీస్‌లో భాగంగా రక్షా బంధన్‌ను పురస్కరించుకుని పోలీసులకు రాఖీలు కట్టారు.

## జివో నెంబర్ 4ను అమలు చేయాలి

**సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కడారినాగరాజు**



ఎంపిడిఓ మార్టిన్ లూథర్‌కు వినతి పత్రం ఇస్తున్న నాగరాజు, కార్మికులు

**నర్సాపూర్, ఆగస్టు 8, ప్రభాతవార్త:** రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ కార్మికలకు అమలు చేస్తున్న జివో నెంబర్ 4ను రాష్ట్ర వ్యాప్తంగాఉన్న గ్రామ పంచాయతీ కార్మికులకు కూడ అమలు చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కడారి నాగరాజు డిమాండ్ చేశారు. సోమవారం నాడు నర్సాపూర్ ఎంపిడిఓ కార్యాలయం ముందు సిఐటియు అధ్వర్యంలో ధర్నా నిర్వహించి ఎంపిడిఓ మార్టిన్ లూథర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో అనేక సేవలు అందిస్తున్న గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు ప్రభుత్వం పరిష్కరించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మురికి పనులు చేసే ఈ కార్మికలు ఆరోగ్యంగా ఉండాలంటే పౌష్టికాహారం అవపరమని వేతనం తక్కువగా ఉండటం వల్ల పౌష్టికాహరం ఏవిదంగా వస్తుందని అన్నారు. నిత్యవసర వస్తు ధరలు విపరీతంగా పెరిగి నందున కటుంబాలను పోషించుకోలేక అనేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. పెరిగిన ధరలకనుగుణంగా వేతనాలు 26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో కార్మికులు మహేశ్, కృష్ణ. ఎల్లం, సత్తయ్య, రమేశ్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### బావిలో హనుమంతు మృతదేహం లభ్యం

**నాగల్‌గిద్ద, ఆగస్టు 8, ప్రభాతవార్త:** బతుకు దెరువు కోసం పక్క గ్రామానికి వెళ్లి జీవనం సాగిస్తున్న వ్యక్తి వ్యవసాయ బావిలో శవమై తేలిన సంఘటన సోమవారం మండల పరిధిలోని మోర్గి గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్ఐ విజయ్‌రావు కథనం ప్రకారం ఇందుకు సం బంధించి పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని ఎనక్‌ప ల్లి గ్రామానికి చెందిన కుమ్మరి హనుమంతు బతుకు దెరువు కోసం గత నాలుగు నెలల క్రితం మోర్గి గ్రామానికి చేరుకుని జీవనం సాగిస్తు న్నాడన్నారు. మోర్గి గ్రామ శివారులోని రైతు ఆనంద్‌రెడ్డికి చెందిన వ్యవసాయ బావిలో సోమవారం హనుమంతు శవమై కానవచ్చాడన్నా రు. మృతుడు హనుమంతుకు గత కొన్ని రోజులుగా ఆరోగ్య సమస్య లతో అవస్థలు పడుతున్నట్లు మృతుని భార్య కవిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

# సమస్యలను సత్వరమే పరిష్కరించాలి

## జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :** ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తుల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ అధికారులను అదేశించారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో సోవారం నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను స్వీకరించి మాట్లాడారు. దరఖాస్తులను క్షుణంగా పరిశీలించి బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చూడాలన్నారు. పెండింగ్ అర్జీలపై అన్ని ప్రభుత్వశాఖల అధికారులు ప్రత్యేక దృష్టి సారించి సత్వరమే అన్నింటికి పరిష్కారం చూపాలన్నారు. దరఖాస్తుదారుడు మళ్లి తిగిరి దరఖాస్తు పెట్టుకోకుండా పరిష్కారం చేయాలని అధికారులను అదేశించారు. భూ సంబంధిత సమస్యలు, రెండు పడక గదుల ఇల్లు, ఇతర సమస్యలు పరిష్కారం కోరుతూ మొత్తం 61 ఫిర్యాదులు వచ్చినట్లు తెలిపారు. ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను స్వీకరించిన జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులకు పంపించి సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అదేశించారు. ప్రజావాణిలో జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, డిఆర్ఓ చెన్నయ్య, డిఆర్‌డిఎ పిడి గోపాల్‌రావు, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.



దరఖాస్తులను స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్

# స్వాతంత్ర్య వజ్రోత్సవాలు విజయవంతం చేయాలి

### ఇంటింటా జాతీయ పతాకాన్ని ఎగురవేయాలి : సీపీ

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :** 75వ స్వాతంత్ర్య భారత వజ్రోత్సవాలు ఈనెల 8 నుంచి 22 వరకు నిర్వహించే ప్రతి కార్యక్రమంలో పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొని విజయవంతం చేయాలని సీపీ ఎన్.శ్వేత తెలిపారు. సీపీ కార్యాలయంలో సోమవారం సిద్దిపేట డివిజన్ పోలీసు అధికారులతో పెండింగ్ కేసులు, ఫంక్షనల్ వర్టికల్‌పై నిర్వహించిన సమీక్షా సమావేశంలో అమె మాట్లాడారు. ఇంటింటా జాతీయ పతాకాన్ని ఎగరవేయాలన్నారు. ప్రాపర్టీ కేసులలో రికవరీ శాతం పెంచాలన్నారు. ఈనెల 13న జరిగే జాతీయ లోక్ అదాలత్ టార్గెట్‌కు మించి కేసులు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. రౌడీలు, కేడీలు, అనుమానితుల కదలికలపై నిరంతరం నిఘా పెట్టాలన్నారు. గ్రేవ్ కేసులలో అరెస్టు చేయని నిందితులను త్వరగా అరెస్టు చేయాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, పోక్సో, క్రైమ్ అగైనెస్ట్ ఉమెన్ కేసుల పరిశోధన పకడ్బంధీగా చేయాలన్నారు. మహిళలపై జరుగుతున్న నేరాలపై సత్వరమే స్పందించి వెంటనే కేసు నమోదు చేసి అరెస్టు చేయాలన్నారు. భరోసా సెంటర్ సేవలు ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలన్నారు. సీసీ కెమెరాల పనితీరును ఎప్పటికప్పుడు పరిశీలించా లన్నారు. ప్రతి రోజు పెండింగ్ పిటిషన్స్‌పై మానిటర్ చేయాలన్నారు. ప్రతి పోలీసు స్టేషన్ పరిధిలో ప్రతి రోజు డ్రంకన్ అండ్ డ్రైవ్ టెస్టులు నిర్వహించాలన్నారు. సమావేశంలో పోలీసు అధికారులు మహేందర్, ఫణిందర్, బిక్షపతి, రవికుమార్, భానుప్రకాష్, జానకీరామ్‌రెడ్డి, కృష్ణ, శ్రీనివాసులు, నాగేశ్వరరావు, సంజయ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న సీపీ శ్వేత

## మల్లన్న సాగర్ నీటి ఎత్తిపోత నిలిపివేత

**తొగుట, అగస్టు 8, ప్రభాతవార్త :** మల్లన్న సాగర్ నీటి ఎత్తిపోతలను సోమవారం నిలిపి వేసినట్లుగా ఈఈ సాయిబాబా తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 16 రోజుల పాటు నీటిని పంపుల ద్వారా మల్లన్నసాగర్‌లోకి ఎత్తిపోసినట్లుగా తెలిపారు. ప్రస్తుతం మల్లన్నసాగర్‌లో 14.47 టిఎంసిల నీరు నిల్వ ఉన్నట్లు వివరించారు. 5.25 టిఎంసిల నీటిని కొండపోచమ్మకు తరలించినట్లు ఆయన తెలిపారు.

## శ్రీ కేతకీ ఆలయంలో భక్తుల సందడి



దర్శనం కోసం క్యూలో నిల్చున్న భక్తులు

**ఝరాసంగం, ఆగస్టు 8, ప్రభాతవార్త:** దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన ఝరాసంగంలోని శ్రీ కేతకీ సంగమేశ్వరస్వామి ఆలయంలో శ్రావణ సోమవారం పురస్కరించుకుని తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్రాల నుండి భక్తులు ప్రత్యేక వాహనాల్లో అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఉదయం నుండే ఆలయ ప్రాంగణంలో భక్తులు బారులు తీరారు. గర్భ గుడిలోకి స్వామి వారి దర్శనం నిమిత్తం దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం భక్తులకు ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలు అందజేశారు.

# వాడవాడలా తెలిసేలా వజ్రోత్సవ వేడుకలు

### జెడ్‌పి చైర్‌పర్సన్ వేలేటి రోజారాధాకృష్ణశర్మ

**ములుగు, ఆగస్టు 8 (ప్రభాతవార్త):**
ఎంతోమంది త్యాగఫలం నేడు మనం పొందుతున్న స్వాతంత్ర్యం అని, అలాంటి స్వాతంత్ర్య పోరాట స్ఫూర్తిని వాడవాడలా తెలిసేలా చేయాలనేది రాష్ట్ర ముఖ్యమంత్రి కెసిఆర్ ప్రభుత్వ ఆలోచన అని సిద్దిపేట జిల్లా జెడ్‌పి చైర్మన్ రోజారాధాకృష్ణ అన్నారు. భారతదేశానికి స్వాతంత్రం వచ్చి 75 సంవత్సరాలు గడుస్తున్న నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వజ్రోత్సవ వేడుకలను హైద్రాబాద్‌లో ఘనంగా నిర్వహిస్తుంది. ఈ వేడుకలకు వెళ్ళేందుకు గానూ సిద్దిపేట జిల్లా నుండి జిల్లా జెడ్‌పి చైర్మన్ వేలేటి రోజారాధాకృష్ణశర్మ, ప్రజాప్రతినిధులు బస్సులో బయల్దేరగా ఈ బస్సు యాత్రకు జెడ్‌పి చైర్మన్ రోజాశర్మ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎంతో మంది త్యాగఫలం, ఎన్నో రకాల ఉద్యమాలతో భారతదేశానికి స్వాతంత్రం లభించిందని, అలాంటి స్వతంత్ర పోరాట స్ఫూర్తిని తెలంగాణ యువత ఆదర్శంగా తీసుకొని ఎదగాలని ఆమె సూచించారు. స్వాతంత్ర పోరాట స్ఫటిమను వాడవాడలా తెలిసేలా చేయాలన్నదే రాష్ట్ర ముఖ్యమంత్రి కెసిఆర్ ఆలోచన అని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి నర్సంపల్లి జయమ్మఅర్జున్‌గౌడ్, వర్గల్ ఎంపిపి లతరమేష్‌గౌడ్, జెడ్‌పిటిసి బాలమల్లుయాదవ్, మర్కుక్ ఎంపిపి పాండుగౌడ్, జెడ్‌పిటిసి యెంబరి మంగమ్మరాంచంద్రం, గజ్వేల్ మున్సిపల్ చైర్మన్ నేతిచిన రాజమౌళిగుప్త, జెడ్‌పిటిసి పంగ మల్లేశంతో పాటు ఆయా మండలాల ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న జిల్లా జెడ్‌పి చైర్‌పర్సన్ వేలేటి రోజారాధాకృష్ణశర్మ

## ఆవాలతో జాతీయ జెండా చిత్రించిన రామరాజు



**గజ్వేల్, ఆగస్టు 8 (ప్రభాతవార్త):** ఆజాది కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా స్వతంత్ర భారత వజ్రోత్సవాలను పురస్కరించుకొని సోమవారం గజ్వేల్ పట్టణానికి చెందిన రామకోటి భక్తసమాజం వ్యవస్థాపక అధ్యక్షుడు రామకోటి రామరాజు తన కార్యాలయంలో 10 అడుగుల భారీ మువ్వన్నెల జాతీయ జెండాను వినూత్నంగా ఆవాలతో గత మూడు రోజుల నుంచి చిత్రించి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశానికి స్వతంత్రం వచ్చి 75వ వసంతంలోకి అడుగిడుతున్న సందర్భంగా జాతీయ జెండాను చిత్రించానన్నారు. ప్రతి ఒక్క భారతీయుడు తమ ఇంటిపై జాతీయ జెండా ఎగురవేసి దేశ భక్తిని చాటాలన్నారు. మనకు స్వతంత్రం తెచ్చిన వారి జీవిత చరిత్రను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. ఇంటింటిపై జాతీయ జెండా ఆవిష్కరించాలని కేంద్ర ప్రభుత్వం పిలుపు నివ్వడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

# భారతదేశ గౌరవాన్ని కాపాడుకుందాం



ప్రధాన వీధులగుండా జాతీయ పతాకంతో ప్రదర్శన నిర్వహిస్తున్న దృశ్యం

**వర్గల్, ఆగస్టు 8 (ప్రభాతవార్త):** భారతదేశ గౌరవాన్ని కాపాడుకోవాలంటూ భారత వజ్రోత్సవాల సందర్భంగా 22వ తేదీ వరకు ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ప్రారంభ సంబరాలు, సమావేశాలు జరుగుతున్న సందర్భంలో వర్గల్ మండలంలోని ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు 150 మీటర్ల జాతీయ పతాకంతో గ్రామంలోని ప్రధాన వీధులగుండా సోమవారం ప్రదర్శన ర్యాలీ నిర్వహించారు. అత్యంత ఉత్సాహంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సతీష్‌కుమార్, సర్పంచ్ గోపాల్‌రెడ్డి, వైద్యాధికారిణి హరిత, ప్రధానోపాధ్యాయులు వెంకటేశర్‌గౌడ్, ఉపాధ్యాయులు, 500 మంది విద్యార్థులతో ఈ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు మాట్లాడుతూ 75 ఏళ్ళ పండుగ మన చేతులమీదుగా జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. తహసీల్దార్ సతీష్‌కుమార్ మాట్లాడుతూ ఈ ప్రదర్శన ర్యాలీని నిర్వహించిన ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులను అభినందించారు. ఇటువంటి కార్యక్రమాలు భావితరాలకు స్వతంత్ర పోరాట విశేషాలు తెలుపుతాయని, విద్యార్థుల్లో దేశభక్తిని పెంపొందిస్తాయని వర్గల్ గ్రామ సర్పంచ్ గోపాల్‌రెడ్డి పేర్కొన్నారు.

## సినిమా హాల్‌ను పరిశీలించిన ఆర్డీవో

**నర్సాపూర్, ఆగస్టు 8, ప్రభాతవార్త:** 75వ స్వాతంత్ర్య వజ్రోత్సవాల్లో బాగంగా 9,10, 11 తేదీల్లో నర్సాపూర్ పట్టణంలోని సాయి డిలక్స్ దియేటర్‌లో గాంధీ జీవిత చరిత్ర పై రూపొందించిన చలన చిత్రంను విద్యార్థులకు ప్రదర్శించ నున్నందున సోమవారం నాడు నర్సాపూర్ ఆర్డీఓ వెంకట ఉపెందర్‌రెడ్డి, మున్సిఫల్ కమీషనర్ చాముండేశ్వరి, ఎంఇఓ బుచ్యా నాయక్, ఎంపిడిఓ మార్టిన్ లూథర్ లు సాయి డిలక్స్ దియేటర్ ను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు సినిమా దియేటర్‌లో విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా అన్ని వసతులు ఉన్నాయా లేవా అని వారు పరిశీలించారు. ఈమేరకు దియేటర్‌లో పర్యటించి వసతులను వారి పరిశీలించారు. నిర్వాహకులను పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిఓ వైద్యశ్రీనివాస్. ఉపాధ్యాయులు సామ్యానాయక్ పాల్గొన్నారు.



సినిమా థియేటర్‌ను పరిశీలిస్తున్న దృశ్యం

# స్వాతంత్ర్య వజ్రోత్సవంలో ప్రముఖులు

**నర్సాపూర్, ఆగస్టు 8, ప్రభాతవార్త:**
దేశానికి స్వాతంత్ర్యం సిద్దించి 75 సంవత్సరాలు పూర్తయిన సందర్బంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 15 రోజుల పాటు స్వాతంత్ర్య భారత వజ్రోత్సవాల కార్యక్రమాలను నిర్వహించాలని ప్రకటించడం జరిగింది.

ఈ మేరకు ఈ కార్యక్రమంలో బాగంగా సోమవారం నాడు హైద్రాబాద్‌లోని హెచ్‌ఐసిసి వేదికగా స్వాతంత్ర్య బారత వజ్రోత్సవ ద్విసప్తాహం ప్రారంభోత్సవ కార్యక్రమం రాష్ట్ర ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు అధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈకార్యక్రమానికి రాష్ట్ర మహిళా కమీషన్ చైర్ పర్సన్ సునీతాలక్ష్మారెడ్డి, నర్సాపూర్ ఎమ్మెల్యే చిలుముల మదన్‌రెడ్డి, నియోజక వర్గ ప్రజా ప్రతినిధులు తదితరులు హాజరయ్యి ఈ వేడుకల్లో పాల్గొన్నారు.



వజ్రోత్సవ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కవిత, మంత్రులతో కలిసి పాల్గొన్న రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ సునీతాలక్ష్మారెడ్డి


బందోబస్తు ఏర్పాట్లను పరిశీలిస్తున్న సిఐ, ఎస్ఐ

## మొహరం బందోబస్తు ఏర్పాట్ల పరిశీలన

**న్యాల్‌కల్, ఆగస్టు 8, ప్రభాతవార్త:** ఈ నెల 10వ తారీఖున మండలంలోని టేకూర్ గ్రామంలో దూద్‌పీర్ల ఊరేగింపు ఘనంగా కొనసాగనుంది. దూద్‌పీర్ల ఊరేగింపును పురస్కరించుకుని సంగారెడ్డి జిల్లా తో పాటు కర్ణాటకలోని పలు ప్రాంతాల నుంచి పదుల సంఖ్యలో దూద్‌పీర్లను ఊరేగింపుగా టేకూర్ గ్రామానికి చేరుకుని గ్రామంలోని కొండగట్టుపై గల దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేసి పీర్లను నమజ్జనం చేస్తూ రావడం ఇక్కడ గత శతాబ్ద కాలంగా ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగా ఉత్సవాలను తిలకించేందుకు పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు చేరుకుంటారు. గ్రామంలో పండగ వాతావరణం నెలకొంటుంది. ఉత్సవాలు ప్రశాంతంగా ముగిసేందుకు జహీరాబాద్ రూరల్ సిఐ భరత్‌కుమార్, హద్నూర్, రాయికోడ్ ఎస్ఐలు వినయ్‌కుమార్, ఏడుకొండలు గ్రామ సర్పంచ్ అమీర్‌తో కలిసి బందోబస్తును పరిశీలించారు. ఉత్సవాలను ప్రశాంతంగా ముగిసేలా ప్రతి ఒక్కరు తమ వంతు సహకరించాలని సిఐ, ఎస్ఐలు సూచించారు.

## ఆజాదికా అమృత్ మహోత్సవం ప్రారంభం


ఆజాదికా అమృత్ మహోత్సవంను ప్రారంభిస్తున్న ఉపాధ్యాయులు

**మనూర్, ఆగస్టు 8, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన మనూర్ గ్రామంలోని ఉన్నత పాఠశాలలో ఆజాదికా అమృత్ మహోత్సవ కార్యక్రమాన్ని ప్రారంభించారు. స్వాతంత్ర్యం సిద్ధించి 75 వసంతాలు పూర్తయిన సందర్భంగా ఫిబ్రవరి 22వ తేదీ వరకు కొనసాగే ఉత్సవాలను సోమవారం ప్రారంభించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యా యులు నాగారం శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ నెల 9వ తేదీన గాంధీ సినిమాను చిన్నారులకు ఉచితంగా నారాయణఖేడ్‌లోని సినిమా టాకీస్‌లో చూపిస్తామన్నారు. 10న జాతీయ హరితహారం పేరిట మొక్కలు నాటడం, 11న పాఠశాల స్థాయిలో ఆటల పోటీలు, , 12న స్వతంత్రతా పరుగు (ఫ్రీడం రన్), 13న రక్తదాన శిబిరంతో పాటు దేశభక్తి గీతాలు ఆలాపన, వ్యాస రచన, ఉపన్యాస, పేయింటింగ్, ముగ్గుల పోటీలు లాంటి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు చంద్రకాంత్, లక్ష్మణ్, మల్లికార్జున్, ధన్‌సింగ్, రాజు, సంగ్రాం, చంద్రశేఖర్, కృష్ణరెడ్డి, శివలింగం, సాంకీబాయి, శివశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## ఇంటింటికి కొబ్బరి మొక్కల పంపిణీ


కొబ్బరి మొక్కలను పంపిణీ చేస్తున్న దృశ్యం

**న్యాల్‌కల్, ఆగస్టు 8, ప్రభాతవార్త:** ప్రతి ఇంట్లో మొక్కలు పెంచుకుంటే గ్రామం ఆహ్లాదకరంగా ఉంటుందన్న లక్ష్యంతో ప్రతి ఇంటికి ఒక కొబ్బరి మొక్కను పంపిణి చేసినట్లు మండల సర్పంచుల ఫోరం ఉపాధ్యక్షులు, మెటల్‌కుంట సర్పంచ్ పీటర్‌రాజు అన్నారు. సోమవారం గ్రామంలోని ఇంటింటికి మొక్కల పంపిణి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ రాజు మాట్లాడుతూ హరితహారం కార్యక్రమంలో భాగంగా కొబ్బరి మొక్కలు పంపిణి చేశామన్నారు. ఇంట్లో నాటుకున్న కొబ్బరి మొక్క చెట్టుగా పెరిగేలా సంరక్షించుకుంటే ఇంట్లో వాతావరణం అహ్లాదకరంగా ఉటుందన్నారు. కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి నితిన్, పంచాయితీ వార్డు సభ్యులు ప్రవీణ్, కాంతమ్మ, నాయకులు వెంకటేశ్, వెంకట్, రాజు, సుభాష్ పాల్గొన్నారు.

## మైత్రీ ఫౌండేషన్‌కు ఉత్తమ సేవ అవార్డు



అవార్డు అందుకుంటున్న దృశ్యం

**గుమ్మడిదల, ఆగస్టు 8, ప్రభాతవార్త:**
సమాజ సేవలో మంచి గుర్తింపు పొందుతూ పలు సేవా కార్యక్రమాలతో ముందుకు వెళ్తాన్న మండల కేంద్రానికి చెందిన మైత్రీ ఫౌండేషన్‌కు ఉత్తమ సేవ అవార్డు లభించింది. మైరతీ ఫౌండేషన్ చైర్మన్ చన్నంశెట్టి మాట్లాడుతూ ఫౌండేషన్ ద్వారా ఉచిత అంబులెన్స్ నిర్వహిస్తునందున ఈ అవార్డు లభించిందని తెలిపారు. ఈ అవార్డును హైదరాబాద్ పబ్లిక్ గార్డెన్స్‌లో తెలంగాణ ర్యా హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ అధ్యక్షురాలు సుభాషిణి, చెంచల్‌గూడ జైల్ సూపరిం టెండెంట్ శివకుమార్ గౌడ్ చేతుల మీదుగా మైత్రీ ఫౌండేషన్ చైర్మన్ చెన్నంశెట్టి ఉదయ్ కుమార్ అంబులెన్స్ ఫైలెట్ మ్యాకాల మహేష్ కుమార్ అందుకున్నారు. ఈ కార్యక్రమలో మైత్రీ ఫౌండేషన్ సభ్యులు కానుకుంటా అంజి గౌడ్, ఉదయ్ సాగర్ తదితరులు పాల్గొన్నారు.

### ఐఐటీ మద్రాస్ బీఎస్సీ డిగ్రీలో కొత్త సబ్జెక్టులు

ప్రోగ్రామింగ్ అండ్ డేటా సైన్స్‌లో కొత్త కోర్సులను ఐఐటీ మద్రాస్ అందిస్తోంది. నగరంలో ఓ సమావేశంలో సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ 4 సంవత్సరాల కాలవ్యవధి కలిగిన బీఎస్‌సీ డిగ్రీని తాము అందిస్తున్నామని చివరి ఏడాదిలో కంపెనీలు, రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్స్‌లో 8 నెలల అప్రెంటిషిప్ చేసేందుకు విద్యార్థులకు అవకాశం దక్కుతుందన్నారు. డేటా విజువలైజేషన్ డిజైన్, ఇండస్ట్రీ 4.0బయోఇన్ఫర్మేటిక్స్‌లో అల్గారిథమిక్ థింకింగ్ వంటి కొత్త సబ్జెక్టులు ప్రవేశపెట్టామని తెలిపారు. తరగతులు ఆన్‌లైన్ లో జరుగుతాయని ఎక్కడ నుంచి ఎవరైనా ఈ కోర్సులకు దరఖాస్తు చేసుకోవచ్చునని పేర్కొన్నారు. దరఖాస్తులను ఈ నెల 19 తేదీవరకు స్వీకరిస్తామని తెలిపారు.



జడ్పీహెచ్ఎస్‌లో స్వాతంత్ర్య వజ్రోత్సవాలను జరుపుకుంటున్న దృశ్యం


విద్యార్థులు 75వసంతాల ఆకారంలో కూర్చోన్న దృశ్యం

# స్వాతంత్ర్య వజ్రోత్సవ వేడుకలకు స్వాగతం

**సదాశివపేట, ఆగస్టు 8, ప్రభాతవార్త:** రాష్ట్రంలో జరుగుతున్న వజ్రోత్సవాల్లో భాగంగా సదాశివపేట పట్టణంలోని శాంతినికేతన్ విద్యాలయంలో కరస్పాండెంట్ మాలిపటేల్ ప్రభు ఆధ్వర్యంలో భాతరదేశ స్వాతంత్ర్యం వచ్చి 75వసంతాలు పూర్తి చేసుకున్న శుభ సందర్భంగా పాఠశాల యందు విద్యార్థులను 75ఆకారంలో కూర్చోబెట్టి వజ్రోత్సవాలకు శాంతినికేతన్ విద్యాలయం విద్యార్థులు, ఉపాధ్యాయులు, యాజమాన్యం స్వాగతం సుస్వాగతం అంటూ స్వాగతం పలికారు.

ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి పాఠశాల కరస్పాండెంట్ మాలిపటేల్ ప్రభు మాట్లాడుతూ కొన్ని వందల సంవత్సరాలు విదేశీ పాలనలో మన దేశం పాలించబడి మన పూర్వులు అనేక సమస్యలు ఎదుర్కొని ఇబ్బందులు పడ్డారు. అలాంటి సమయంలో మహాత్ములంతా కలిసి భారతీయుల ఇబ్బందులు తొలగించాలని బ్రిటిష్ సామ్రాజ్యంపై యుద్ధం ప్రకటించి ఎదిరించి వీరోచిత సాహసాలు చేసి బలిదానాలకు సిద్ధమై ఎంతో మంది వీరులను మనం కోల్పోయి స్వాతంత్ర్యాన్ని సాధించుకున్నాం.

సాధిం చుకున్న స్వాతంత్రాన్ని 75సంవత్సరాలుగా దినదిన దేశాభివృద్ధి చెందుతూ ప్రపంచ దేశాలకు ఆదర్శంగా మన దేశం ఎదుగుతుంది. కావున ఇకముందు దేశ రక్షణ బాధ్యత ప్రతి విద్యార్థికి ఉంటుంది. ఎందుకంటే కొంత మంది విద్యార్థులు రైతులు, సైనికులు, ఉద్యోగస్తులుగా, పాలన అధికారులుగా, న్యాయ నిర్ణయితలుగా, రాజకీయ నాయ కులుగా అన్ని రంగాల్లో ఎదుగుతారు కాబట్టి ఎన్ని ఏమైనా దేశ రక్షణ విషయానికి వస్తే స్వార్థ ప్రయోజనాలను పక్కనబెట్టి దేశ రక్షణకే ఈనాటి విద్యా ర్థులు భవిష్యత్తులో ముందుండాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వజ్రోత్సవాలను ఘనంగా జరుపుకోవాలని పిలుపునిచ్చారు. కాబట్టి రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు జారీ చేస్తున్నటువంటి సూచనలు పాటిస్తూ వజ్రోత్సవాలు ఘనంగా నిర్వహించుకోవాల న్నారు. పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### శివంపేట పాఠశాలలో ..

**చౌటకూర్, ఆగస్టు 8, ప్రభాతవార్త:** మండలంలోని శివంపేట గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం 75వ స్వాతంత్ర్య వజ్రోత్సవాలను పురస్కరించుకుని ఉత్సవాలను ఘనంగా ప్రారంభించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.


చౌటకూరలో పీర్లను దర్శించుకుంటున్న ప్రజల దృశ్యం

## ఘనంగా పీర్ల పండుగ


మునిపల్లి మండలం తక్కడపల్లిలో పీర్ల ఊరేగింపు దృశ్యం

**చౌటకూరు, ఆగస్టు 8, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన చౌటకూరులో సోమవారం పీర్ల పండగను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. కుల మతాలకు అతీతంగా పండగలో పాల్గొని సంబరాలు చేసుకున్నారు. గ్రామంలో ఏర్పాటు చేసిన బి ఫాతిమా పీర్లను గ్రామస్థులు దర్శించుకుని డట్టీలు కప్పి తమ మొక్కుబడులు చెల్లించుకున్నా రు. సోమ వారం గ్రామంలో చిరుజల్లులు టపటప మంటూ కురుస్తున్నా ప్రజలు ప్రజలు పండ గను ఆనందోత్సవాలతో ఘనంగా జరుపుకున్నారు. ఆటలు ఆడుతూ, పాటలు పాడుతూ పండగను కోలాహలంగా జరుపుకున్నారు.

## మొహరం పండుగకు విరాళం అందజేత


పదివేల రూపాయల విరాళాన్ని అందజేస్తున్న ఎన్ఎంఆర్ సభ్యులు

**జిన్నారం, ఆగస్టు 8, ప్రభాతవార్త:** ఉట్ల గ్రామంలో నిర్వహించే (మొహరం) పీర్ల పండుగను పురస్కరించుకొని టీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు, చిట్కుల్ సర్పంచ్ నీలం మధు ముదిరాజ్ పదివేల రూపాయల విరాళాన్ని ఎన్ఎంఆర్ సభ్యులు చేతుల మీదుగా మొహరం నిర్వహకులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎంఆర్ సభ్యులు మహ్మద్ మహబూబ్, మహ్మద్ గౌస్, బొగురు సత్యనారాయణ ముదిరాజ్, పూజరి రాజు, దాది రమేష్, విరబోయిన సాయి, క్రరె నాగరాజు, చాకలి మల్లేష్, కంచం బిక్షపతి, బషీగారి బిక్షపతి, మహ్మద్ ఖాజా పాషా, మహ్మద్ రహీమ్, వడ్ల శ్రీనివాస్, సుంకరబోయిన మహేష్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## హైదరాబాద్‌కు తరలి వెళ్లిన ఎంపీపీ, జడ్పీటీసీలు


స్వాతంత్ర్య దినోత్సవ వజ్రోత్సవం కార్యక్రమానికి తరలి వెళ్లిన నాయకులు

**సిర్గాపూర్, ఆగస్టు 8 ప్రభాతవార్త:** హైదరాబాద్‌లో సీఎం కేసీఆర్ 75వ స్వాతంత్ర్య దినోత్సవ వజ్రోత్సవం కార్యక్రమం సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి సిర్గాపూర్ మండల ఎంపీపీ అధ్యక్షులు మహిపాల్‌రెడ్డి, సిర్గాపూర్ జడ్పీటీసీ రాఘ వరెడ్డిలు తరలివెళ్లారు. 75వ స్వతంతృత భారత వజ్రోత్సవాలను ఘనంగా నిర్వహిం చాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. 15 రోజుల పాట కార్యక్రమాలు జరుగనున్నాయి.75 ఏండ్ల స్వాతంత్ర్య భారతదేశంలో తెలంగాణ రాష్ట్రం యావత్ దేశానికే దిశానిర్దేశం చేస్తుంది.

## గీతం డీమ్డ్ విద్యార్థి శ్రీధర్ కుమార్‌కు డాక్టరేట్

**పటన్‌చెరు, ఆగస్టు 8, ప్రభాతవార్త:** బాగా సాగే పదార్థా నమూనాతో తొడ ఎముక నమూనా బలం, క్రియాశీల ప్రవర్తన మూల్యాంకనం" అనే అంశంపై విశ్లేషణ, దానిపై సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించిన హైదరాబాద్, గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలోని మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం పరిశోధన విద్యార్థి శ్రీధర్ కుమార్ ఆదిభట్లను డాక్టరేట్ వరించింది. ఈ పరిశోధన మార్గదర్శనం వహిస్తున్న గీతం స్కూల్ ఆఫ్ టెన్నాలజీలోని ఏరోస్పేస్ ఇంజనీరింగ్ విభాగం ప్రొఫెసర్ ఎ సత్యాదేవి సోమవారం విడుదల చేసిన ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించారు. తొడ అమరికలో తేడాల వల్ల నడకలో నొప్పి, ఒక కాలు మరొకదానిపై కుదించబడడం, కొన్ని సందర్భాలలో కదలిక పూర్తిగా ఆగిపోవడం వంటి విభిన్న సమస్యలకు దారితీస్తుందని, ఇవి పుట్టకతో లేదా పోషకాహారం లోపం, ప్రమాదం, గాయం వంటి పలు ఇతర కారణాల వల్ల సంభవించవచ్చిని ఆమె వివరించారు. అలగే బోలు ఎముకల వ్యాధజ (వోపీ) అనేది మధ్య వయస్కులతో అత్యంత సాధారణమైన, ప్రధాన ఆరోగ్య రుగ్మతలలో ఒకటన్నారు. ప్రస్తుత పరిశోధనలో, తొడ ఎముక నిర్మాణ సమగ్రతపై ఈ పరిస్థితుల ప్రభావాలను అన్వేషించేందుకు ప్రయత్నించినట్టు తెలియజేశారు. శ్రీధర్ సమర్పించిన సిద్ధాంత వ్యాసం పీహెచ్‌డీ పట్టాకు అర్హత సాధిం చడం పట్ల గీత విశ్వవిద్యాలయం, హైదరాబాద్ అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీఎస్ రావు, గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, స్కూల్ ఆఫ్ టెక్నాలజీ అసోసి యేట్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎన్ సీతారామయ్య, పలు విభాగాల అధిపతులు, అధ్యా పకులు, సిబ్బంది పలువురు అభినందించినట్టు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## వ్యక్తి అదృశ్యం

**మేడ్చల్, ఆగస్టు 8. ప్రభాతవార్త :** ఇంటి నుండి వెళ్లిన ఓ వ్యక్తి అదృశ్యమైన సంఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలి పిన వివరాల ప్రకారం మేడ్చల్ పట్టణంలో నివాసముండే ప్రమోద్ విలాస్ జాదవ్ (30) ప్రైవేట్ కంపెనీలో పని చేస్తున్నాడు. అతను ఆదివారం మధ్యా హ్నం రెండు గంటల ప్రాంతంలో ఇంటి నుండి ఎవరికి చెప్పకుండా వెళ్లిపోయి తిరిగి ఇంటికి రాలేదు. అతని కోసం వెతికినా ఆచూకిలభించకపోవడంతో సోమ వారం తండ్రి విలాజ్ ఆనంద జాదవ్ మేడ్చల్ పోలీస్‌స్టేషన్‌లోఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్నారు.

## ప్రారంభమైన కెవిపిఎస్ రాష్ట్ర మహాసభలు

### ప్రముఖ అంబేద్కరిస్టు జె బి రాజు

**సంగారెడ్డి మున్సి పాలిటీ, ఆగస్టు 8, ప్రభాతవార్త:**
దేశంలో దళిత, బహుజనులు సృష్టిస్తున్న సంపదను విదేశీ కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టాలని చూస్తున్న కేంద్ర ప్రభుత్వ విధానాలను వ్యతిరేకంగా అన్ని వర్గాల ప్రజల ఐక్యంగా ఉద్యమాలు నిర్వహించాలని ప్రముఖ అంబేద్కరిస్టు జె జి రాజు పిలుపునిచ్చారు. సంగారెడ్డి జిల్లా కేంద్రంలో సోమవారం కేవీపీఎస్ మూడవ రాష్ట్ర మహాసభలు పిఎస్ఆర్‌గార్డెన్‌లో ఘనంగా ప్రారంభమయ్యాయి. మహాసభల ప్రారంభ సూచికంగా కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు జాన్ వెస్లీ ఆత్మగౌరవం, సమానత్వం, కుల నిర్మూలన లక్ష్యాలు గల జెండాను ఆవిష్కరించారు. అనంతరం జరిగిన ప్రతినిధులు మార్క్స్ సిద్ధాంతం అయితే భారతదేశంలో సామాజిక విప్లవం సాధించడం కోసం అంబేద్కర్ చేసిన పోరాటం మరొక సామాజిక విప్లవానికి నాంది అని అన్నారు. దేశంలో అధికారంలో ఉన్న పాలకులు అంబేద్కర్ రచించిన రాజ్యాంగానికి తూట్లు పొడిచే విధంగా వ్యవహరిస్తూ మళ్లీ మనువాదాన్ని అమలు చేయాలని చూస్తున్నారని పేర్కొన్నారు. అధికారంలో ఉన్న బీజేపీ అనుసరిస్తున్న ఆర్ఎస్ఎస్ సిద్ధాంతానికి వ్యతిరేకంగా హిందూ సంస్కృతికి వ్యతిరేకంగా ప్రజలను సమీకరించాలని పిలుపునిచ్చారు. ఈ రాష్ట్ర మహాసభల్లో సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, టిపిఎస్కె రాష్ట్ర కార్యదర్శులు తాళ్ల నాగరాజు, ఆనగంటి వెంకటేశులు హాజరై మహాసభలు జయప్రదం కావాలని, కెవిపిఎస్ పోరాటాలకు మా సంఘాల మద్దతు, తోడ్పాటు అందిస్తామని సౌహార్ధ సందేశం ఇచ్చారు. ఈ మహాసభలకు జాన్‌వెస్లీ, పాలడుగు నాగార్జున, అతిమెల మాణిక్యం, పల్లెర్ల లలిత లు అధ్యక్షవర్గం సభ్యులు. కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు మీసాల కురుమయ్య సంతాప తీర్మానం ప్రవేశపెట్టారు. మహాసభల్లో కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తప్పెట్ల స్కైలాబ్ బాబు కార్యదర్శి నివేదిక ప్రవేశపెట్టారు. ఆఫీస్ బేరర్స్ మందుల సామేలు, నందిపాటి మనోహర్, సురేష్, ఆర్ మహిపాల్, అరూరి కుమార్, కోట గోపి, దయ్యాపు రాధాకృష్ణ, దినకర్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ప్రారంభమైన విగ్రహాల ప్రతిష్టాపన

**జహీరాబాద్, ఆగస్టు 8, ప్రభాతవార్త**
పట్టణంలోని శాంతినగర్‌లో నిత్య పూజలందుకుం టూ కొంగుబంగారంగా విరాజిల్లుతున్న శ్రీ సంతోషి మాత ఆలయంలో సోమవారం విగ్రహాల ప్రతిష్టా పన, ఆలయ శిఖర ప్రతిష్టాపన పూజా కార్యక్రమాలు ఘనంగా ప్రారంభం అయ్యాయి. ఆలయంలో ఉప దేవతలైన గణపతి, ఈశ్వరుడు, సుబ్రమణ్య స్వామి విగ్రహాల ప్రతిష్టాపనతో పాటు ఆలయ శిఖర ప్రతిష్టాపన చేసేందుకు పూజా కార్యక్రమాలకు శ్రీకా రం చుట్టారు. ఆలయంలో గణపతి పూజ, అంకు రార్పణ, నాంది, పాస్త, నవగ్రహ మండపారాధన, అగ్నిస్థాపనం, హోమాటలు, విగ్రహాల ధాన్యదివా సం, జలాదివాసం, హోమ కార్యక్రమాలు వేద బ్రా హ్మణులు వేద మంత్రాలు వల్లిస్తూ భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం 8 గంటల ప్రాంతంలో పట్టణంలోని హౌజింగ్ బోర్డు హనుమాన్ మందిరం నుంచి సంతోషిమాత ఆలయం వరకు మహిళలు కలషాలతో ఊరేగింపుగా చేరుకుని అమ్మవారికి అభిషేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మ ధ్యాహ్నం 2 గంటలకు మహాహారతి, లలిత సహ స్రత నామ పారాయణ, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. రాత్రికి భజన కార్యక్రమాలు ఉంటా యని, 10వ తారీఖున ఉదయం 8.22 గంటలకు విగ్రహాల స్థాపన ఉంటాయని ఆలయ కమిటి బాధ్యు లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

## ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి

### రామచంద్రాపురం కార్పోరేటర్ పుష్పనగేష్


కాలనీవాసులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ పుష్పనగేష్

**రామచంద్రాపురం, ఆగస్టు 8, ప్రభాతవార్త:** రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కారానికి కృషి చేస్తునానమని రామచంద్రాపురం కార్పొరేటర్ పుష్పనగేష్ పేర్కొన్నారు. గత ఎన్నో సంవత్సరాలుగా ఉన్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సమస్య ఉందని స్థానిక పాత రామచంద్రాపురం వాసులు తెలుపడంతో సోమవారం జలమండలి డిజిఎం శివకృష్ణ, మేనేజర్ జనార్ధన్ తో కలిసి 1, 2వ బ్లాక్‌లో కార్పొరేటర్ బూరుగడ్డ పుష్పనగేష్ పర్యటించారు. గతంలో ఎప్పుడో 20 సంవత్సరాల క్రితం వేసిన పైప్‌లైన్ వల్ల డ్రైనేజీ నీరు ఇళ్లముందే వస్తుంది అని, తీవ్రమయిన దుర్వాసన వల్ల అనారోగ్య సమస్యలు తలెత్తున్నాయని స్థానికులు కార్పొరేటర్ దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే నూతన పైప్‌లైన్ కొరకు ప్రతిపాదన పూర్తి చేసి ఇస్తే జీఎంతో చేర్చించి మంజూరు చేయిస్తానని కార్పొరేటర్ జలమండలి అధికారులకు ఆదేశించారు. అనంతరం కాలనీలో పర్యటించారు. అక్కడ ఉన్న మహిళలతో కాసేపు చర్చించి కాలనీలలో ఏమైనా సమస్యలు ఉన్నాయా అని తెలుసుకున్నారు. త్వరలోనే డ్రైనేజీ సమస్య పరిష్కరించి నూతన పైప్‌లైన్ వేయిస్తానని కార్పొరేటర్ కాలనీ వాసులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు మోహన్‌రెడ్డి, టౌన్ ప్రెసిడెంట్ గోవింద్, సీఎం మల్లేష్, వెంకటలక్ష్మారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, నర్సింహారెడ్డి, అమర్, పురుషోత్తం, రామచందర్‌రెడ్డి, అప్పల భాస్కర్, మహేందర్‌సింగ్, అరుణ్‌సింగ్, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

## అవకతవకలకు పాల్పడుతున్న మదనపల్లి కారోబార్‌పై చర్య తీసుకోండి

**శంషాబాద్ ఆగస్టు8,ప్రభాతవార్త :** శంషాబాద్ మండలంలోని మదన పల్లి గ్రామ పంచాయతీ కారోబార్ కత్తుల జగన్‌పై చర్యలు తీసుకోవా లని పంచాయతీ సభ్యురాలు కట్ట శోభారాణీ అధికారులకు ఫిర్యాదు చేశారు.గ్రామపంచాయతీలో అనేక అవకతవకలకు పాల్పడుతూ తప్పు డు పత్రాలు సృష్టిస్తున్న కారోబార్ జగన్‌పై చర్య తీసుకోవాలని మం డల పరిషత్ అభివృద్ధి అధికారి మండల పంచాయతీ అధికారి సంబం ధిత అధికారులకు కట్ట శోభారాణి సోమవారం ఫిర్యాదు చేశారు. గ్రామ పంచాయతీ పరిధిలో తమకు ప్లాటు ఉన్నదని తమ అవసరాల నిమి త్తం గతంలో సగం ప్లాట్‌ను విక్రయించామని తమ ఆధీనంలోనే ఉన్న దని తెలిపారు.కాగా కారోబార్ జగన్ ఇటీవల గ్రామ పంచాయతీ దృష్టి కి కానీ తమ దృష్టికి కానీ తీసుకురాకుండా ఇతరుల పేర్ల మీద అను మతి పత్రాలు జారీ చేశారని ఫిర్యాదుల పేర్కొన్నారు.మామిడిపల్లి గున్నయ్య అనే వ్యక్తి పేరు మీద గృహ నిర్మాణానికి అనుమతిస్తున్నట్లు పత్రాలను సృష్టించారని ఈ విషయమై తాను సోమవారం జరిగిన గ్రామసభలో ప్రస్తావించగా తనపై దుర్భాషలాడారని ఆరోపించారు.

## పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం

**చౌడపూర్ ఆగస్టు8,ప్రభాతవార్త :**
ప్రస్తుతం డెంగ్యూ జ్వరాలు విజృంభిస్తుండడంతో ప్రజలు అప్రమత్తం గా ఉండాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకొని,దోమల నివారణ చర్యలు తీసుకోవాలని ఎంపిహెచ్ఈఓ రాములు అన్నారు.సోమవారం మండల పరిధిలోని కొత్తపల్లి ప్రభుత్వ గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠ శాలలో డిఎంఓ విజయ కుమార్ ,స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ విజయలక్ష్మి ఆదేశాల మేరకు దోమల నివారణకు డిడిటి మందును పిచికారి చేయించి, విద్యార్థుల్లో పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు.

## వర్షంలోనూ కొనసాగిన విఆర్ఏలు సమ్మె

**చౌటకూరు, ఆగస్టు 8, ప్రభాతవార్త:** సిఎం హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ విఆర్ఏలు చేస్తున్న నిరవధిక సమ్మెను వర్షంలో తడుస్తూ నిర్వహించారు. సోమవారం వర్షం కురుస్తున్నా విఆర్ఏలు తమ డిమాండ్ల సాధన కోసం నినాదాలు చేస్తూ సమ్మెను కొనసాగించారు. కార్యక్రమంలో విఆర్ఏలు శ్రీహరి, కృష్ణ, మల్లేశం, లింగయ్య, ఇంద్రమ్మ, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

### రాయికోడ్‌లో..

**రాయికోడ్, ఆగస్టు 8, ప్రభాతవార్త:** మోకాళ్లపై కూర్చుని విఆర్ఏలు వినూత్నంగా నిరసన వ్యక్తం చేశారు. సోమవారం విఆర్ఏలు వర్షంలో తడుస్తూ తమ సమ్మెను కొనసాగించారు. సిఎం చేసిన హామీలు అమలయ్యే వరకు తమ సమ్మెను ఆపేదిలేదని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల విఆర్ఏలు పాల్గొన్నారు.

### విఆర్ఏల వినూత్న నిరసన

**జహీరాబాద్, ఆగస్టు 8, ప్రభాతవార్త:** పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ముందు గత పక్షం రోజులుగా విఆర్ఏలు నిర్వహిస్తున్న నిరవధిక సమ్మెను సోమవారం వినూత్న రీతిలో నిర్వహించారు. విఆర్ఏల జిల్లా జేఏసి కో-చైర్మన్ నాగరాజు ఆధ్వర్యంలో పీర్లను ఊరేగింపుగా తహసీల్దార్ కార్యాలయం ముందుకు చేరుకుని ఆలయం ముందర కొంత సేపు ఆటలు ఆడుతూ పాటలు పాడుతూ తమవంతు నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో విఆర్ఏ సంఘం మండల ఉపాధ్యక్షులు జైపాల్, కోశాధికారి దత్తు, మహిళా విఆర్ఏలు అనిత, స్వప్న, లావణ్య తదితరులు పాల్గొన్నారరు.

## ఈ కేవైసి నమోదు చేసుకుందాం


పంటల నమోదు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న ఏఇఓ

**మనూర్, ఆగస్టు 8, ప్రభాతవార్త:** ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి పథకానికి సంబంధించి ఈ కేవైసి నమోదుతో పాటు రైతులు సాగు చేస్తున్న పంటల వివరాలను వ్యవసాయ విస్తీర్ణ అధికారి ప్రవీణ్‌కుమార్ మండలంలోని ఎల్గోయి గ్రామంలో సోమవారం నమోదు చేసుకున్నారు. ప్రతి రైతు ఈ కేవైసి చేసుకోవాలని, ఈ కేవైసి చేసుకున్న రైతులకే మునుముందు వారి ఖాతాల్లో 2వేల రూపాయల డబ్బులు జమఅవుతాయన్నారు. తాగు సాగుచేసుకుంటున్న పంటలను నమోదు చేసుకుంటే కలిగే ప్రయోజనాలపై రైతులకు వివరించారు. కార్యక్రమంలో టిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు విఠల్‌రావుపాటిల్, గ్రామ రైతు బంధు అధ్యక్షులు రాజేందర్‌రావు, రైతులు డి శరీఫ్, వాజీద్‌మియా, నాందేవరావుఉ, అయూబ్, మారుతి పాల్గొన్నారు.

## 232 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

**జహీరాబాద్, ఆగస్టు 8, ప్రభాతవార్త:** తెలంగాణ ప్రభుత్వం పేదలకు అందిస్తున్న రేషన్ బియ్యాన్ని అక్రమంగా గుజరాత్ రాష్ట్రానికి తరలిస్తుండగా సోమవారం పట్టుకున్నామని చిరాగ్‌పల్లి ఎస్ఐ కాశీనాథ్ తెలిపారు. జహీరాబాద్ డిఎస్పీ రఘు ఆదేశాలతో పట్టణ సీఐ తోట భూపతి పర్యవేక్షణలో చిరాగ్‌పల్లి పోలీసులు, సివిల్ సప్లయ్ అధికారులు కలిసి మాడ్గి ఆర్టీవో చెక్‌పోస్ట్ వద్ద ఉదయం తనిఖీ నిర్వహిస్తుండగా అనుమానస్పదంగా హైదరాబాద్ నుండి వస్తున్న లారీని నమ్మదగిన సమాచారంతో ఆపి తనిఖీ చేయగా అందులో 580 బ్యాగులలో 232 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుకున్నామని ఎస్ఐ కాశీనాథ్ తెలిపారు. ఇందుకు సంబంధించిన కర్ణాటక రాష్ట్రానికి చెందిన లారీ డ్రైవర్ల రాజు రాథోడ్, సయ్యద్ రహిమత్ లను అదుపులోకి తీసుకొని వచారించగా లారీ ఓనర్ అలీమొద్దిన్ లను అదుపులోకి తీసుకున్నామని, పట్టుబడిన బియ్యాన్ని సివిల్ సప్లైయ్ గోదాంకు తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఆయన తెలిపారు. ఈ తనిఖీలలో సివిల్ సప్లైయ్ డిప్యూటీ తాహసిల్దార్లు సురేష్ కుమార్, బసవయ్య, చిరాగ్‌పల్లి పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యార్థులకు మెడికల్ కీట్స్ పంపిణీ

**తలకొండపల్లి ఆగస్టు8,ప్రభాతవార్త :** తలకొండపల్లి మండల పరిధిలో ని గట్టుఇప్పలపల్లి జడ్పిహెచ్ఎస్ ,వెంకట్రావ్‌పేట యుపిఎస్ పాఠశాలలో సోమవారం పీపుల్స్ యాక్షన్ ఫర్ రూరల్ అవేకనింగ్,హ్యూమన్ రైట్స్ క్లబ్ జిల్లా కో ఆర్డినేటర్ కొమ్ము తిరుపతి ఆధ్వర్యంలో కామేశ్వర సాయి ప్రసాద్ జ్ఞాపకార్థం బోస్కో సేవ కేంద్రం డైరెక్టర్ ఫాదర్ శరత్, పార తెలంగాణ రాష్ట్ర కో ఆర్డినేటర్ సొడాబత్తిన అంబేద్కర్ వారి సహ కారంతో విద్యార్థులకు మెడికల్ కీట్స్‌ను అందజేశారు. అమరుడు కామేశ్వర సాయి ప్రసాద్ తల్లిదండ్రులు న్యాయవాది వి. లక్ష్మణ శర్మ,హైకోర్టు న్యాయవాది జ్యోతి,పాఠశాల ప్రధాన ఉపాధ్యా యులు పి. కృష్ణయ్య, యుపిఎస్ హెచ్ఎం డివి రాజలక్ష్మి, రాఘురా ములు, డెవిడ్,వైస్ ఎంపిపి శ్రీనివాస్ రెడ్డి,సర్పంచ్ జయమ్మ, వెంకట య్య,ఎస్ఎంసి చైర్మన్ జి.జంగయ్య,డప్పు మహేష్ పాల్గొన్నారు.

## అభయహస్తం డబ్బులు చెల్లించాలని వినతి

**యాచారం, ఆగస్టు 8 ప్రభాతవార్త**
మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన డ్వాక్రా సంఘాల మహిళలు అభయహస్తం పథకం కింద జమ చేసుకున్న మొత్తాన్ని వెంటనే వారి ఖాతాల్లో జమ చేయాలని కోరుతూ సోమ వారం ఎంపిడివోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మహిళా సంఘాల భా ద్యులు మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు గతంలో అభయహస్తం కింద డబ్బులు జమ చేశామని, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు తరువాత అభయహస్తం ఫించన్ రద్దు చేశారన్నారు. పొదుపు చేసి న అభయహస్తం డబ్బులను వడ్డీతో సహా తిరిగి చెల్లిస్తామని ప్రభుత్వం ప్రకటన చేసినప్పటికీ నేటికీ ఖాతాల్లో జమ చేయలేదన్నారు. అభయ హస్తం డబ్బులు లబ్దిదారుల ఖాతాల్లో తిరిగి వడ్డీతో సహా చెల్లించాలని కోరారు.